

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,46,668, బంగారం 4 గ్రాముల 350 మిల్లీ గ్రాములు, వెండి 28 గ్రాముల 400 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



16 మందికి విముక్తి

-10లో



నాయకులు ప్రజలకు చేరువగా ఉండాలి

-10లో

న్యూస్‌రీల్

తొలి టికెట్టు కొనుగోలు చేసిన సీఎం

• జూన్ 9 నుంచి ఖండాంతర ఫుట్‌బాల్ టోర్నీ



తొలి టికెట్టు అందుకుంటున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నగరంలో జూన్ 9వ తేదీ నుంచి 18 వరకు జరగనున్న ఇంటర్ కాంటినెంటల్ (ఖండాంతర) కప్–23 ఫుట్‌బాల్ టోర్నీ తొలి టికెట్టును సీఎం నవీన్ పట్నాయక్ మంగళవారం కొనుగోలు చేశారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య జనరల్ సెక్రటరీ షాజీ ప్రభాకరన్, భారత ఫుట్‌బాల్ జట్టు కోచ్ ఇగోర్ స్టిమాక్ సమక్షంలో భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి తొలి టిక్కెట్‌ను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ పోటీ నాలుగు దేశాల మధ్య జరుగనుందిజ భారత్, లెబనాన్, మంగోలియా, వనాటు జట్లు పోటీలో పాల్గొంటాయి. ఒడిశా ప్రజలు ఫుట్‌బాల్ క్రీడాభిమానులు. ఈ అద్భుతమైన పోటీకి ఆతిథ్యం వహించడం గౌరవప్రదమని సీఎం తెలియజేశారు. అంతర్జాతీయ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఒడిశా ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కాబట్టి, బ్లూ టైగర్స్ (భారత్)ను ఉత్సాహపరిచేందుకు ఫుట్‌బాల్ అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి రావాలని ముఖ్యమంత్రి కోరారు. టీమ్ ఇండియా తమ మొదటి క్యాంపెయిన్ గేమ్‌లో మంగోలియాతో తలపడుతుంది.

నేడు ప్లస్ 2 ఫలితాలు

భువనేశ్వర్: ప్లస్ 2 సైన్స్ మరియు కామర్స్ విభాగాల వార్షిక పరీక్ష ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు ప్రకటిస్తామని రాష్ట్ర ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్‌ఈ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాలు ప్రకటించడంతో పాటు మార్కులు తదితర ఉత్తీర్ణత వివరాలను chseodisha.nic.in, orissaresults.nic.in వెబ్‌సైట్‌లలో చూడొచ్చన్నారు. అయితే ఆర్ట్స్, వృత్తి విద్యా విభాగాల ఫలితాలు జూన్ 8 నాటికి వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి ఏప్రిల్ 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్లస్ 2 పరీక్షలకు 3,50,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల ఫలితాలు 45 రోజుల్లోపు ప్రకటిస్తామని సీహెచ్‌ఎస్‌ఈ అప్పట్లో ప్రకటించినా, వాస్తవానికి కొంత జాప్యం చోటు చేసుకుంది. ఏప్రిల్ 10 నుంచి రెండు దశల్లో జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించారు. ఇంతలో 2023–24 విద్యా సంవత్సరానికి హయ్యర్ సెకండరీ స్కూల్స్ (హెచ్‌ఎస్‌ఎస్)లో ప్లస్ 2 కోర్సులో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన 106 పాఠశాలలతో సహా మొత్తం 2,109 హెచ్‌ఎస్‌ఎస్‌ల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

అక్రమ దుకాణాలు ఎత్తివేత



షాపులను ఎత్తివేయిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలో హైస్కూల్ జంక్షన్ నుంచి మార్కెట్, పాత బస్టాండ్ వరకు ట్రాఫిక్ ఎక్కువ అవుతుండడంతో మంగళవారం ఉదయం ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ బబులీ నాయక్, మున్సిపల్ అధికారులు అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను ఎత్తివేయించారు. గత నెల రోజులుగా పాతపట్నం, పర్లాకిమిడిలలో అమ్మవారి సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుపై వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆక్రమణలను ఖాళీ చేయించారు. మళ్లీ అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని పురపాలక ఇంజినీరు జుధిష్టర బెహరా హెచ్చరించారు.

తలోదొండో కాలువ ప్రమాదంపై విచారణ

భువనేశ్వర్: కటక్ నగరం మాతృ భవన్ సమీపంలో సోమవారం తలోదొండో కాలువలో కారు పడిపోవడంతో కందర్‌పూర్‌కు చెందిన జ్ఞాన రంజన్ జెనా అనే వ్యాపారి మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణకు మంగళవారం ఆదేశించారు. ఈ ప్రాంతంలో వంతెన పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. భద్రత కంచె (సేఫ్టీ బారికేడ్లు) ఏర్పాటు చేయకుండా నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ విషాద సంఘటన చోటు చేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్, సబ్ కలెక్టర్ ఉమ్మడిగా విచారణ జరిపి కలెక్టర్ భవానీ శంకర్ చొయినికి నివేదిక దాఖలు చేస్తారని అధికార వర్గాల సమాచారం. ప్రమాదంలో 63 ఏళ్ల వ్యాపారవేత్త మరణించినట్లు ప్రకటించగా, ప్రమాదం నుంచి బయటపడిన అతని భార్య అంజన (55) చికిత్స పొందుతోంది.

తరలివెళ్లిన తారాదేవి

• ముగిసిన ఉత్సవాలు
• నిజ మందిరంలో కొలువైన అమ్మవారు



నిజ మందిరానికి బయల్దేరిన తారాదేవి

బరంపురం నగరానికి సమీపంలోని లంజిపల్లెలో జరుగుతున్న తారదేవి సంబరాలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారు నిజ మందిరానికి బయల్దేరారు. ఈ సంబరాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. తాత్కాలిక మందిర ప్రాంగణంలో సంబరాల నిర్వాహకులు కుని బెహర సారథ్యంలో వేద పండితులు వేమగోటి వాసుదేవ్ శాస్త్రీ నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారు నిజ మందిరానికి బయల్దేరి, మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో నిజ మందిరానికి చేరుకున్నారు. అనంతరం ఏకాంత సేవలు చేపట్టి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారితో పాటు వేలాది మంది మహిళా భక్తులు ఘటాలతో ఆలయానికి చేరుకున్నారు. – బరంపురం



ఘటాలతో బయల్దేరిన మహిళలు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

విజిలెన్స్ వలలో జూనియర్ ఇంజినీర్



అరెస్టు చేసిన జూనియర్ ఇంజినీర్ తదితరులను చూపిస్తున్న విజిలెన్స్ అధికారులు

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. గంజాం జిల్లా కుకుడాఖండి బ్లాక్‌కి చెందిన నీటి పారుదల జూనియర్ ఇంజినీర్ ప్రశాంత్ కుమార్ పాత్రో, ఇస్టిమేటర్‌గా ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ధీరేంద్ర, కలాసీ సురేంద్రదాస్‌లు విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. బరంపురం విజిలెన్స్ ఏఎస్పీ గణేష్ చంద్ర ప్రధాన్ తెలిపిన వివరాలు మేరకు.. గంజాం జిల్లా కుకుడాఖండి బ్లాక్‌కి చెందిన బొడోబొంద నీటి పారుదల ప్రాజెక్టు విషయంలో సంబంధిత కాంట్రాక్టర్ పి.రాజ సేనాపతికి రూ.24 వేలు లంచం ఇవ్వాలని జూనియర్ ఇంజినీర్‌తో పాటు ఇస్టిమేటర్, కలాసీలు డిమాండ్ చేశారు. సదరు బాధిత కాంట్రాక్టర్ సేనాపతి బరంపురం విజిలన్స్ అధికారులను ఆశ్రయించారు. దీంతో విజిలన్స్ ఎస్పీ ఆదేశాలతో విజిలెన్స్ ఏఎస్పీ గణేష్ చంద్ర ప్రధాన్ నాయకత్వంలో విజిలెన్స్ బృందం పథకం పన్ని లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా వారిని అరెస్టు చేశారు. అన్ని అధారాలు సేకరించి కోర్టుకు తరలించినట్లు ఎస్పీ మాయధర్ స్వాంయి తెలియజేశారు.

శ్రీమందిరం పాలక మండలి సమావేశం

• జగన్నాథుని గీత గోవిందం ఉత్తరీయం తయారీ విధానంలో మార్పు
• స్నానయాత్ర నుంచి రథయాత్ర వరకు షెడ్యూల్ ఖరారు



పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: శ్రీమందిరం పాలక మండలి మంగళవారం సమావేశమైంది. ఈ సందర్భంగా జగన్నాథుని గీత గోవిందం ఉత్తరీయం తయారీ విధానంలో భారీ సంస్కరణకు శ్రీకారం చుట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గీతగోవింద ఉత్తరీయం తయారీకి అవసరమైన పట్టు పోగుల తయారీలో సంస్కరణలు తీసుకొచ్చారు. ఇక నుంచి పట్టు పురుగులను చంపకుండా సేకరించిన పట్టు పోగులతో ఉత్తరీయం తయారు చేస్తారు. దీని నమూనా శ్రీమందిరం పాలక మండలి సమావేశంలో ప్రవేశ పెట్టారు. పాలక మండలి సభ్యులు ఉత్తరీయం పట్టు పోగుల తయారీ సంస్కరణ ప్రక్రియను అభినందించారు. సరికొత్త శైలిలో తయారు చేసిన గీతగోవింద ఉత్తరీయం ఆలయంలో అమలు చేయడానికి పాలక మండలి అంగీకరించిందని ఆలయ తాత్కాలిక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. అలాగే సమావేశంలో ఈ ఏడాది జరగనున్న యాత్ర కార్యక్రమాలు ఖరారు చేశారు. స్నానయాత్ర నుంచి రథయాత్ర వరకు విధి విధానాల క్రమపద్ధతిని నిర్ధారించారు.

☛ అహింసా శైలిలో స్వామివారి పట్టు ఉత్తరీయం

జగన్నాథుని సేవలో గీత గోవింద పట్టు ఉత్తరీయంకు ప్రముఖ స్థానముంది. స్వామివారికి సమర్పించిన ఈ ఉత్తరీయం అతిరథ మహారథులకు శేషవస్త్రంగా బహూకరించి సత్కరిస్తారు. తరతరాలుగా ఈ సంప్రదాయం ఆచరణలో కొనసాగుతోంది. సంప్రదాయ రీతిలో పట్టు పోగులు సేకరించి ఉత్తరీయం తయారీ కొనసాగుతుంది. అయితే ఇప్పుడు సంప్రదాయ శైలికి సరికొత్త ఒరవడి ఆవిష్కరించారు. ఇక నుంచి అహింసా మార్గంలో స్వామి పట్టు వస్త్రం తయారవుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ అందుబాటులో లేనందున చాలాకాలం తర్వాత శ్రీమందిరం పాలక మండలి సమావేశానికి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదివరకు పట్టు పోగుల తయారీకి పట్టు పురుగులను చంపడం జరిగేదన్నారు. అయితే రాష్ట్ర హస్తకళల శాఖ డైరక్టర్ సోహన్ కృష్ణ సాహు తన వ్యక్తిగత కృషితో పట్టు పోగుల సేకరణలో సరికొత్త ప్రక్రియని ఆవిష్కరించారని తెలియజేశారు. పట్టు పురుగును చంపకుండా, సురక్షితంగా తొలగించి పట్టు పోగులను సేకరించడం ఈ ప్రక్రియ విశిష్టత అని పేర్కొన్నారు. దీనిని రాష్ట్ర హస్తకళల శాఖ ఆమోదించిందని తెలిపారు. ప్రభుత్వం ఈ పట్టు వస్త్రాన్ని ఆలయంలో ప్రవేశపెట్టాలని ఆకాంక్షిస్తుందన్నారు. సరికొత్త శైలిలో తయారు చేసిన గీత గోవిందం పట్టు ఉత్తరీయం సమావేశంలో అందరి ముందు ప్రదర్శించారు. దీన్ని శ్రీమందిరంలో నిత్య పూజలందుకుంటున్న శ్రీ జగన్నాథుని సేవలో జోడించాలని పాలక మండలి నిర్ణయించిందని, త్వరలో హస్తకళ విభాగంతో సంప్రదించి కొత్త శైలి గీత గోవిందం ఉత్తరీయం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.



సమావేశంలో ప్రవేశపెట్టిన సరికొత్త శైలి తయారీ గీత గోవింద పట్టు ఉత్తరీయం

అండర్–16 ఆటగాళ్ల ఎంపిక పూర్తి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహంతి



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో అండర్–16 క్రికెట్ ఆటగాళ్ల ఎంపిక మంగళవారంతో పూర్తయ్యింది. స్థానిక విక్రమ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపికలో జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ ఎంపిక శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో క్రికెట్‌కు అత్యంత ఆదరణ ఉందన్నారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ మాట్లాడుతూ జూన్ 5వ తేదీన కటక్‌లో అండర్–16 క్రికెట్ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. దీనిలో భాగంగా టీమ్‌ను ఎంపిక చేసేందుకు 5 రోజుల పాటు పోటీలు నిర్వహించామని, వారికి కోచ్‌లుగా బలరాం పాణిగ్రహి, బపి పొరజ, వై.యువరాజ్‌లు వ్యవహరించారని తెలియజేశారు. మరో రెండు రోజుల్లో ఉత్తమ 15 మందిని ఎంపిక చేసి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు. శిబిరాన్ని అనూప్ పాత్రో, బాలారాయ్, భవానీ పండ, ఉపేంద్ర మహరాణ పర్యవేక్షించారు.

గంజాయి కొనుగోలుకు వచ్చి.. పోలీసులకు చిక్కి



జయపురం: సీజ్ చేయబడిన కారు







పట్టుబడిన నిందితులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో గంజాయి కొనేందుకు వచ్చి పోలీసులకు ఇద్దరు రాజస్థాన్ యువకులు చిక్కారు. వారితో పాటు వారికి గంజాయి సమకూర్చే కొరాపుట్ జిల్లా వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు వర్గాలు మంగళవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సదరు పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం అంబాగుడ పోలీసు పంటి అధికారి ప్రశాంత కుమార్ మహంతి తన సిబ్బందితో 26వ జాతీయ రహదారిలో పెట్రోలింగ్ జరిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో నవరంగపూర్ వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో ఉన్నటువంటి ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించగా ఒక్కొక్కరూ ఒక్కోలా జవాబులు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అలాగే కారు రాజస్థాన్‌లో రిజిస్ట్రేషన్ చేయబడి ఉండడంతో పోలీసులకు అనుమానం మరింత పెరిగింది. వెంటనే తమదైన శైలిలో విచారించగా వారి నుంచి అసలు విషయం బయటపడింది. అరెస్టైన ఇద్దరు వ్యక్తులు రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్ జిల్లా గోవర్ధన్ విలాస్ బజారుబొహలూర్‌కు చెందిన నరేష్ సలాభి (24), రణసింగ్ రస్వత్ (28)కాగా, గంజాయి సమకూర్చే వ్యక్తి జయపురం సమితి బొబొజువుని పంచాయతీ పుషపురి గ్రామానికి ధబులు హరిజన్(27) అని పోలీసులు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.15,200 నగదుతో పాటు 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను కోర్టుకు పంపామని, జామీనును కోర్టు తిరస్కరించడంతో జైలుకు పంపడం జరిగిందన్నారు.

ప్రమాదంలో బాలిక మృతి



డ్రైనేజీ పైపులు కుప్పకూలిన దృశ్యం



ప్రమాదంలో చిక్కుకున్న బాలిక

భువనేశ్వర్: కటక్ నగరం కేశర్‌పూర్ ప్రాంతంలో జైకా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ భారీ పైపుల అకస్మాత్తుగా కుప్పకూలడంతో ఒక బాలిక మంగళవారం మృతి చెందింది. 16 ఏళ్ల బాలిక అవతలి వైపు నుంచి డ్రెయిన్ దాటేందుకు ప్రయత్నిస్తుండగా పైపులు, తాత్కాలిక ఇనుప వంతెన మధ్య ఇరుక్కుపోయింది. పైపులు ఆమెకి గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడింది. దాదాపు 45 నుంచి 60 నిమిషాల పాటు ఇలా ఇరుక్కుపోయిన బాలికను కేశర్‌పూర్ స్థానికులు ప్రొక్లయిన్‌తో పైప్‌లను తొలగించి పైకి తీశారు. అనంతరం స్థానిక ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. కటక్ నగరంలో చాలా కాలంగా బాక్స్ డ్రెయిన్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. స్థానికుల వినియోగం కోసం ఓపెన్ డ్రెయిన్‌లపై తాత్కాలిక వంతెన నిర్మించారు. దీనిపై తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడంపై స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. తలోదొండో కాలువలోకి కారు పడిపోవడంతో ఒక వ్యక్తి మరణించి, అతని భార్యకు తీవ్ర గాయాలైన మర్నాడే ఈ సంఘటన జరగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

• మంత్రి సుదాం మరాండి



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి సుదాం మరాండి

భువనేశ్వర్: రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతున్నట్లు పాఠశాలలు–సామూహిక విద్యా విభాగం మంత్రి సుదాం మరాండి తెలిపారు. విభాగం వార్షిక పురోగతి వివరాలను మీడియాకు మంగళవారం వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్లస్ 2 కోర్సులో ఎక్కువ మంది విద్యార్థులను చేర్చేందుకు, రాష్ట్రంలోని ప్లస్ 2 తరగతుల్లో సీట్లను పెంచేందుకు నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ ఏడాది మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీట్ల పెంపునకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అవసరాన్ని బట్టి సీట్లు పెంపుదల ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

☛ అదనపు పాఠశాలలు

విద్యార్థుల ప్రయోజనం కోసం ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 106 కొత్త హయ్యర్ సెకండరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ కొత్త పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు 2023–24 విద్యా సంవత్సరం నుంచి జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల మరియు సామూహిక విద్యాశాఖ కార్యదర్శి అవస్తి.ఎస్ పేర్కొన్నారు. ఈ కొత్త అప్‌గ్రేడ్ హయ్యర్ సెకండరీ పాఠశాలలను ప్రారంభించడం వలన 13,000 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. జిల్లా విద్యా శాఖాధికారులు, ఇతర అధికారులు ప్రవేశ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంలో నియమితులైనట్లు తెలిపారు.

☛ పెరిగిన ఉత్తీర్ణత శాతం

రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) ఇటీవల ప్రకటించిన మెట్రిక్యులేషన్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే అధికంగా నమోదు కావడం విశేషం. గతేడాది ఉత్తీర్ణత 90.55 శాతానికి పరిమితమవ్వగా, ఈ ఏడాది 96.4 శాతం నమోదైనట్లు వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరం కోసం హయ్యర్ సెకండరీ స్కూల్స్ (హెచ్‌ఎస్‌ఎస్) లో ప్లస్ 2లో అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. నిరుత్సాహకరమైన నమోదు రికార్డు కారణంగా 88 పాఠశాల్లో కొత్త విద్యార్థుల అడ్మిషన్లు నిలిపివేసినట్లు ప్రకటించారు. తొలిరోజు ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించిన 11వ తరగతిలో చేరేందుకు 37 వేల మంది విద్యార్థులు వివరాలు నమోదు చేశారని డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ (డీహెచ్‌ఎస్‌ఈ) తెలిపింది. వీరిలో 21,700 మంది అభ్యర్థులు అడ్మిషన్లకు అవసరమైన ఫీజులను డిపాజిట్ చేశారని వెల్లడించారు.

క్లుప్తంగా

బీజేడీ నాయకులకు సత్కారం



తిరుపతిరావును సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పాతపట్నంలో జరుగుతున్న నీలమ్మ అమ్మవారి ఉత్సవాలకు పర్లాకిమిడి బీజేడీ నాయకులు, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావును పాతపట్నం అమ్మవారి కమిటీ సభ్యులు ఆహ్వానించి మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, ఆర్ఎంసీఎస్ ప్రెసిడెంట్ ఎస్.గజపతిరావు, సీనియర్ నాయకులు బసంత్ దాస్, యువనేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతికి ప్రత్యేక పూజలు



విజయగణపతికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు చాణక్య ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతభిషేకం, స్నపనం, అర్చన నిర్వహించారు. ఈ పూజల్లో ఎన్సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు రాజు, రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాలూరు వాసి ప్రతిభ



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజయమౌళి

సాలూరు: ఢిల్లీలో నిర్వహించిన సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ పోటీల్లో సాలూరు పట్టణానికి చెందిన యువకుడు బర్లి విజయమౌళి బంగారు పతకం సాధించాడు. ఈ నెల 28న నిర్వహించిన పోటీల్లో 66 కిలోల విభాగంలో 400 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విజయమౌళిని కుటుంబసభ్యులు, బంధువులు, తదితరులు అభినందించారు.

145 మద్యం బాటిల్స్ సీజ్



సీజ్ చేసిన మద్యం బాటిల్స్‌తో ఎస్సై, సిబ్బంది

చీపురుపల్లి: అక్రమంగా రవాణా చేస్తున్న 145 మద్యం బాటిల్స్‌తో పాటు రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాశి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో మండలంలోని కరకాం గ్రామానికి చెందిన పొన్నాడ పాపారావు 145 మద్యం బాటిల్స్ రవాణా చేస్తూ పట్టుబడడంతో బాటిల్స్ సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. మద్యం అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమతి లేని బెల్టు దుకాణాలు నిర్వహిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



పార్వతీపురం: పట్టణంలోని కొత్తపోలమ్మ కాలనీకి చెందిన ఎం.వీరభద్ర రిలయన్స్ స్మార్ట్ బజార్‌కు వెళ్లి వస్తుండగా లస్సీ షాపు వద్ద మంగళవారం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో తల వెనుక భాగంతో పాటు కాలి చిటికిన వేలుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.

నాయకులు ప్రజలకు చేరువగా ఉండాలి

- మాజీ ఎంపీ నెక్కంటి హితవు



మాట్లాడుతున్న నెక్కంటి పక్కనే చైర్మన్ పట్నాయక్, వైస్ చైర్మన్ పండ తదితరులు

రాయగడ: మున్సిపాలిటీలో జరిగే ప్రతి ఎన్నికలో బీజేడీపై అభిమానం చూపిస్తున్న ప్రజలకు నాయకులు చేరువగా ఉండాలని మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు సూచించారు. స్థానిక రాణిగుడ ఫారం లోని ఆయన నివాసంలో మున్సిపాలిటీ పరిధిలోని బీజేడీ కౌన్సిలర్లు, ఆయా ప్రాంతాల ప్రముఖులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు ఎల్లవేళలా ప్రజలతో కలసిమెలసి ఉండాలన్నారు. వారి సమస్యలను విని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ప్రజలకు అందుబాటులో లేకపోతే రానున్న రోజుల్లో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నెక్కంటి సూచించారు. గత ఐదుసార్లు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేడీ విజయం సాధిస్తూ వస్తుందంటే అందుకు కారణం ప్రజల ఆదరాభిమానాలే అన్నారు. అందువల్ల గెలిపొందిన కౌన్సిలర్లు వారి పరిధుల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేడీ విజయం సాధించాలంటే క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాయగడ పట్టణంలో పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సుమారు రూ.53 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు పూర్తయితే భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్ర పండతదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, నాయకులు

16 మందికి విముక్తి



రక్షించబడిన బాధితులతో ఎస్పీ శుశ్రీ

కొరాపుట్: రొయ్యల పరిశ్రమలో చిత్రహింసలు అనుభవిస్తున్న 16 మందిని నబరంగ్‌పూర్ పోలీసులు రక్షించారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ఎస్.శుశ్రీ మాట్లాడుతూ.. ఈనెల 28న జిల్లాలోని ఖాతీగుడలో కొందరు గిరిజనులు తమ వాళ్లు పడుతున్న బాధలపై ఫిర్యాదు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా బంటుమిల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ఒక రొయ్యల పరిశ్రమలో ఈ ప్రాంత గిరిజనులు చిక్కుకున్నారన్నారు. ఒక లేబర్ కాంట్రాక్టర్ మంచి వేతనాలు ఇప్పిస్తామని వీరిని పట్టుకుపోయాడని పేర్కొన్నారు. అక్కడ వీరికి సరైన తిండి పెట్టకుండా, మొబైల్ ఫోన్లు తీసుకొని చిత్ర హింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి వాళ్లను రక్షించినట్లు తెలియజేశారు. బాధితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిశ్రమ నిర్వాహకులు, లేబర్ కాంట్రాక్టర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. వారిని పట్టుకోవడం కోసం ఖాతిగుడ పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఇలా బయట ప్రాంతాలకు వెళ్లి బాధలు పడుతున్నవారు ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పనులకు పంపవద్దని సూచించారు.

వైభవంగా సూర్యనారాయణ మూర్తి స్వామి కల్యాణం



సూర్యనారాయణస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో గల శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో ఉషా, ఛాయాదేవి సమేత సూర్యనారాయణ మూర్తి, ఉమా సోమలింగేశ్వరస్వామి కల్యాణాలను ఆలయ ఆణువంశిక ధర్మకర్త, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి. రమణరాజు దంపతులు, ఆయన సోదరుల దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి సంబంధించిన ప్రత్యేకపూజలు వేకువజామునుంచి మొదలు పెట్టారు. ఈ కల్యాణానికి గ్రామానికి చెందిన పలువురు భక్తులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణ వేడుక భక్తులను అద్యంతం ఆకట్టుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

మాదకద్రవ్యాల రవాణా నేరం

బొబ్బిలి: మాదకద్రవ్యాల రవాణా నేరమని, వాటిని కలిగి ఉన్నా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పాతబొబ్బిలి, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టిన ఆయన ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేయడంతో పాటు రామభద్రపురం, రాయగడ రోడ్డులో వెళ్లే వాహనాల్లో సోదాలు చేపట్టారు. గంజాయి రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

మూడు లారీలు సీజ్

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామాన్ని ఆనుకునిఉన్న కొండ లోని కొంతభాగంలో గ్రావెల్‌ను అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తుండగా మైన్స్ అధికారులు మూడు లారీలను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా మైన్స్ ఎ.డి ఎస్కేకే మల్లేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో కొంతకాలంగా ప్రభుత్వానికి చెందిన కొండతో పాటు చుట్టుపక్కల గల ప్రభుత్వ డీ పట్టా భూముల్లో కూడా అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి పూట తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మూడు లారీలతో పాటు, ఒక జేసీబీతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొండ ప్రాంతాన్ని పరిశీలించి మూడు లారీలు, జేసీబీని అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. తదుపరి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నామన్నారు.

ప్రభుత్వ మద్యం షాపులో చోరీ



మద్యం షాపులో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎస్సై ముకుందరావు,ఏఎస్సై యువరాజు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ మద్యం షాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ లక్షా,32వేలు నగదు దోచుకుపోయారు. ఈ చోరీకి సబంధించి ఎస్సై ఎస్.ముకుందరావు, మద్యం షాపు సూపర్‌వైజర్ మహలక్ష్మినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం మద్యం విక్రయించిన సొమ్మును ఎప్పటిలాగానే షాపులో గల లాకర్‌లో పెట్టి విధులు ముగించుకుని షాపులో పనిచేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మన్‌లు వెళ్లిపోయారు. రాత్రి కాపలా దారులకు షాపును అప్పజెప్పి జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. కాగా మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు వెనుక భాగంలో ఇనుప రేకును వంచి లోనికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు సిబ్బంది తెలుసుకుకి లాకర్‌లో గల రూ,లక్షా,32వేలు దోచుకుపోయినట్లు గుర్తించారు. అయితే లాకర్ తాళాలు సక్రమంగా వేయలేదని ఈ పని ఇంటి దొంగలే చేసినట్లు అనుమానిస్తున్నామని ఎస్సై ముకుందరావు తెలిపారు.ఈ మేరకు సూపర్‌వైజర్ మహలక్ష్మినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కొలువుదీరిన ఘటాలు



అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

రాయగడ: గ్రామదేవత బురదల పోలమ్మ ఉత్సవాల్లో భాగంగా కన్నవారి ఇంటి నుంచి సంబరాల వేదిక వద్దకు వచ్చిన అమ్మవారు తాత్కాలికంగా మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వేదిక వద్ద కొలువుదీరారు. అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలకు భక్తుల దర్శనార్థం వేదిక వద్ద పసుపు కుంకుమలతో అలంకరించి పూజారులు నిలిపారు. సోమవారం రాత్రి తన కన్నవారి ఇంటి నుంచి వచ్చిన అమ్మవారు కాలినొప్పులతో మంగళవారం విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం నుంచి అమ్మవారిని అమె అక్కాచెల్లెలతో కలిపి పుర వీధుల్లో ఊరేగిస్తారు. దీనిని నగర పరిక్రమణగా పిలుస్తారు. ప్రతీ ఏడాది సాంప్రదాయంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈసారి బురదల పోలమ్మ, మజ్జి గౌరమ్మ, సాత పోలమ్మ ఘటాలు వెండితో రూపొందించారు. ఈసారి మిగతా ఘటాలతో వీటిని కూడా ఊరేగిస్తారు. దుష్టశక్తులు ఏపీ నగరంలోకి ప్రవేశించకుండా అమ్మవారు పురవీధుల్లో పర్యటిస్తారు. ఇదిలాఉండగా అమ్మవారి సేవకులు పూజారి, పూజారమ్మలు కన్నవారి ఇంటి నుంచి సంబరాల వేదిక వద్దకు వచ్చిన ఆనందంలో నృత్యం చేశారు. దీనిని తిలికించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే మహిళలు మెయిన్ రోడ్డు వద్దనున్న సంబరాల వేదిక ప్రాంగణంలో లలితా పారాయణ పఠనం చేశారు.



లలితా పారాయణం చేస్తున్న మహిళలు



పూజారి, పూజారమ్మల నృత్యం

ఘనంగా నీలమ్మ సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



ఏలూరు నుంచి వచ్చిన కాంతారా ట్రూప్

పర్లాకిమిడి: స్థానిక ఎనిమిదో వార్డు పిన్నింటి పాపయ్య వీధిలో గ్రామ దేవత నీలమ్మ సంబరాలు మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆఖరి రోజు సందర్భంగా సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. డీజే సౌండ్స్, బాణాసంచాలతో పురవీధుల్లో హోరెత్తించారు. ఏలూరు నుంచి విచ్చేసిన కాంతారా ట్రూప్ డ్యాన్సులు స్థానికులను ఆకట్టుకున్నాయి.

ఉపాధి వేతనదారు మృతి



మృతి చెందిన ఈదల సీతయ్య

కొమరాడ: మండలంలోని కోటిపాం పంచాయతీ గుంప గదబవలస గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు ఈదల సీతయ్య(56)సోమవారం ఉపాధి పని ముగించుకుని ఇంటికి వెళ్లిన వెంటనే సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో గ్రామస్తులు, భార్య లక్ష్మి 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు కొంత మొత్తం పోగు చేసి మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి దహన సంస్కారాలు చేశారు. మృతుడి కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు. దీనికి సంబంధించి ఉపాధి హామీ ఏపీఓ బాలకృష్ణను వివరణ కోరాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.



లక్ష్మణరావు మృతదేహం

బొలెరో ఢీకొని వృద్ధుడు..

రాజాం సిటీ: స్థానిక మెయిన్ రోడ్డులో బొలెరో వాహనం ఢీకొని గడ్డవీధికి చెందిన చీడి లక్ష్మణరావు (65) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పూల కొట్టులో పనిచేస్తున్న లక్ష్మణరావు రోజూలాగానే పని చేసేందుకు మంగళవారం వేకువజామున నడుచుకుంటూ వస్తున్నాడు. ఆర్టీసీ ఔట్‌గేటు వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న బొలెరో వ్యాన్‌ఢీకొనడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తమ్ముడు గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రాణంపై పొగ ఎందుకు?

పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్ అంటాడు కన్యాశుల్కంలో గిరీశం పాత్రధారి. పొగ తాగేవారు తమను తాము సమర్థించు కోవడానికి వాడే మాట ఇది. నిజానికి పొగ తాగడం అంటే జీవితానికి పొగ పెట్టుకోవడమే. ఊపిరితిత్తులు, గుండె, రక్త నాళాలను దెబ్బతీస్తూ గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలను ధూమపానం తెచ్చిపెడుతుంది. రకరకాల కేన్సర్లకూ కారణమవుతుంది. పొగాకు వినియోగానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు పొగాకు వ్యతిరేక దినోత్సవం.



- ధూమపానంతో కేన్సర్, పలు రకాల వ్యాధులు
- పొగాకు ఉత్పతులకు దూరంగా ఉండాలని వైద్యుల హితవు

విజయనగరం ఫోర్ట్: ధూమపానం కారణంగా గుండెపోటు, కేన్సర్, వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడిన వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకు పెరుగుతోంది. గుండెపోటుకు గురైన ప్రతి ముగ్గురిలో ఒకరు ధూమపానం కారణంగానే ప్రమాదకర పరిస్థితికి గురవుతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. మధుమేహ వ్యాధి అదుపులో లేకపోవడంతో ఆ ప్రభావం కిడ్నీలు, లివర్, కళ్లు వంటి కీలక అవయవాలపై పడుతోంది. సిగరెట్, చుట్ట తాగడం ఫ్యాషన్‌గా మారిపోతోంది. ఒకరిని చూసి మరొకరు సిగరెట్, చుట్ట తాగడం అలవాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను జనం ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజురోజుకు పొగతాగే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో పొగతాగే వారి సంఖ్య 60 శాతం వరకు ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక సిగరెట్ నిమిషం జీవితకాలాన్ని తగ్గించేస్తుందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. సిగరెట్ తాగిన వారితో పాటు ఆపొగను పీల్చిన వారు సైతం వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో నిరాక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత వాసులు ఎక్కువగా సిగరెట్, చుట్ట తాగేవారు. కానీ నేడు పల్లె , పట్టణం తేడా లేకుండా ప్రతి ఒక్కరు పొగతాగుతున్నారు. యువత కూడా సిగరెట్ తాగడం ఫ్యాషన్‌గా భావిస్తూ అలవాటు పడడం ఆందోళన కలిగిస్తున్న అంశం. పొగ తాగడం వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిసినప్పటికీ అలవాటు పడిన వారిలో మార్పు రావడం లేదు. పొగతాగుతున్న వారిలో 8 శాతం యువత ఉండడం గమనార్హం. పొగతాగుతూ వారు అనారోగ్యం బారినపడడమే కాకుండా చుట్టు పక్కల ఉన్న వారిని కూడా అనారోగ్యం పాలుజేస్తున్నారు.



నోటి కేన్సర్ సోకిన వ్యక్తి

పొగతాగడం వల్ల ప్రాణాంతక వ్యాధులు

సిగరెట్, చుట్ట తాగడం వల్ల ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. పొగ తాగడం వల్ల గొంతు, ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. వాటితో పాటు క్రానిక్ బ్రాంకైటిస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పొగ తాగడం వల్ల న్యుమోనియా అధికమవుతుంది. ఇన్‌ఫెక్షన్స్ అధికమవుతాయి. సీఓపీడీ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

కేన్సర్, బ్రాంకైటిస్ బారిన పడి మృత్యువాత

కేన్సర్ ముదిరిపోయినంత వరకు గుర్తించ లేకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారు. కేన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. కానీ ముదిరితే మరణమే తప్పదు.

ధూమపానంతో జిల్లాలో రోగుల వివరాలు ఏడాదికి (అంచనా)	
గుండెజబ్బు	15వేలు
బ్రెయిన్‌స్ట్రోక్	6 వేలు
సుగర్ అదుపులోలేకపోవడం	15 వేలు
కేన్సర్	2వేలు
మానసిక రుగ్మతలు	5 వేలు

ఏడాదికిరూ.1.40 కోట్లు:

అన్ని రకాల వర్గాల వారికి సిగరెట్లు, చుట్టలు అంటుబాటులో ఉన్నాయి. ఏడాదికి రూ.1.40 కోట్ల వరకు సిగరెట్లు, చుట్టల కోసం ఖర్చు చేస్తున్నారు. సామాన్య ప్రజలు చుట్టలు, తక్కువ రకం సిగరెట్లు తాగుతున్నారు. సంపన్నవర్గాల వారు ఖరీదైన సిగరెట్లు తాగుతున్నారు .

పొగ తాగితే జీవితకాలం తగ్గినట్లే



పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. సిగరెట్లు తాగడం జీవితకాలం తగ్గిపోతుంది. పొగాకు తాగే వారి కుటుంబంలో పిల్లలు ఉంటే వారి మెదడుపై ప్రభావం ఉంటుంది. పొగ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్, సీఓపీడీ వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంది.

డాక్టర్ బొత్స సంతోష్,
డిప్యూటీ సూపరింటెండెంట్,
పలమనాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్లుప్తంగా

కార్మిక హక్కుల సాధనకు పోరాటం



జెండా ఆవిష్కరణ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

రణస్థలం: కార్మిక హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పైడిభీమవరం పారిశ్రామికవాడలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, బంటుపల్లి వద్ద యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ ఎదుట మంగళవారం సీఐటీయూ జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

108 అంబులెన్సులో ప్రసవం



బిడ్డను చూపిస్తున్న సిబ్బంది

లావేరు: మండలంలోని సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన గర్భిణి మహంతి విమలకు మంగళవారం వేకువజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం తెలియజేశారు. ఈఎంటీ కె.ఈశ్వర్, పైలట్ సత్యనారాయణలు వెంటనే గ్రామానికి చేరుకుని విమలను శ్రీకాకుళం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



యువతతో మాట్లాడుతున్న గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్‌బాబు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తోందని, యువతీ యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జె.మహేష్‌బాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. శిక్షణ అందిస్తున్న తీరు, వసతులను అడిగి తెలుసుకున్నారు. పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్న యువతతో మాట్లాడారు. అనంతరం సోషల్ ఉపాధ్యాయురాలు తంగి ఎర్రమ్మ పాల్గొని పిల్లలకు జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలను నిర్వహించగా, ఉపాధ్యాయురాలు రెడ్డి లలిత పిల్లలకి కథలు, తెలుగు పద్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏసీ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణ మూర్తి, కె.చిరంజీవులు, ప్రత్యూష, టి.రాంబాబు, పి.ఈశ్వరరావు, పి.భానుమతి, పి.రామమోహన్, గణేష్ పాల్గొన్నారు.

29 మంది బెట్టింగ్‌రాయుళ్లపై కేసులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో సోమవారం రాత్రి ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడిన 29 మందిపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. దేశల్లవీధికి చెందిన గండి ప్రణీత్‌కుమార్, మరో ఏడుగురుతో కలిసి ఆన్‌లైన్ బెట్టింగ్ (బాల్ టు బాల్)కు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతని వద్ద నుంచి రూ.2వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ ఏపీహెచ్‌బీ కాలనీ సమీపంలో పాకల కిషోర్, మరో 20 మందితో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పొడుతూ పట్టుబడ్డాడు. ఇతని వద్ద నుంచి రూ.11వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్-2023 వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో నోటిఫికేషన్ షెడ్యూల్ మేరకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నారు. సహాయ కేంద్రంలో 12001 నుంచి 28000 ర్యాంకు వరకు సర్టిఫికెట్లు పరిశీలించగా.. 455 మంది హాజరయ్యారు. వీరిలో ఓసీ, బీసీలు 432, ఎస్సీ, ఎస్టీలు 23 మంది ఉన్నారు. 29న ప్రారంభమైన పరిశీలనకు రెండు రోజుల్లో మొత్తం 730 మంది హాజరయ్యారు. బుధవారం 28001 నుంచి 43 వేల ర్యాంకు మధ్య విద్యార్థుల పత్రాలు పరిశీలించనున్నారు. గతంలో హాజరు కాని విద్యార్థులు సైతం పత్రాల పరిశీలనకు హాజరుకావచ్చు. జూన్ 5 వరకు ఇది కొనసాగుతుంది



కంచిలి: కంచమ్మ అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న కాంతారా ప్రదర్శన



కంచిలి: కనువిందు చేసిన స్ట్రీట్ డ్యాన్స్



కంచిలి: ప్రత్యేక ఆకర్షణగా బిందెల నృత్యం



వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడులో పోటెత్తిన భక్తులు

పల్లెగూటికి పండగొచ్చింది

గ్రామదేవత ఉత్సవాలతో పల్లెలు పండగ చేసుకుంటున్నాయి. ఊరంతా ఒకేచోటకు చేరి అంబరాన్నంటేలా సంబరాలు జరుపుకొంటున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో సందడిగా గడుపుతున్నారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు చల్లదనం చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జిల్లాలో మంగళవారం ఇచ్ఛాపురం, పలాస, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్



కవిటి: కవిటిలో ఉపోదయ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో నృత్యాలతో అలరిస్తున్న యువకులు



వజ్రపుకొత్తూరు: పౌరానిక ఘట్టం వేషధారణలో యువత



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పగటి వేషాలు సందడి

మ్యాంగోవర్..!



- నిల్వ ఉంచుకుంటే ఎన్నేళ్లయినా రుచికరమే
- ఎండు మామిడి బద్దల తయారీలో ఉద్దానం వాసులు

మూకుడులో పప్పు ఒంటరిగా ఉడకడం అంత మర్యాద కాదు. అందుకే ఓ రెండు ఎండు మామిడి బద్దలు జత చేయాలంటారు ఉద్దానం వాసులు. రుచి కోల్పోయిన జిహ్వకు ఎన్ని రకాలు వండి పెట్టినా లాభం లేదు. ఉప్పుకారం కలిపిన ఎండు మామిడి బద్దలే మహత్తరమైన మందు అంటారు వాళ్లు. అంతేనా.. చద్దన్నంలోకి ఉల్లిపాయలు పాత కాంబినేషను. ఎండు మామిడితో చేసి తీపి ఊరగాయను మిళాయించి చూడండి నోట్లో బ్లాస్టేనని చెబుతుంటారు. అసలు హ్యాంగోవర్‌లా మ్యాంగోవర్ కలిగించే ఈ ఎండు మామిడి బద్దల కథేంటి అనడిగితే తడుముకోకుండా తయారీ విధానం గురించి వివరిస్తారు. సీజను కూడా ఇదే మరి.



మామిడి కాయలపై తొక్కను తీసి నిలువుగా చీల్చుతున్న మహిళా

ఇచ్ఛాపురం రూరల్: ఎండు మామిడి బద్దలు. మామిడిని నిలువునా కోసి, ఎండబెట్టి, ఉప్పుకారం రాసి నిల్వ చేసే పదార్థమిది. ఈ బద్దలు తియ్య తియ్యగా.. పుల్లపుల్లగా ఉంటాయి. ఒడిశా మీదుగా ఉద్దానంలోని ఆంధ్రా పల్లెలు వీటిని విరివిగా వాడుతుంటాయి. మామిడి కాయల సీజన్ కావడంతో ప్రస్తుతం ఉద్దానం వాసులంతా ఎండు మామిడి బద్దలు తయారీలో పనిలో నిమగ్నమయ్యారు.

తయారీ ఇలా..

- వేసవిలో మామిడి పండ్లను తినడానికే అంతా ఇష్టపడతారు. కానీ ఉద్దానం ప్రాంతీయులు మాత్రం ఎండు మామిడినే ఇష్టపడతారు.
- తమ తోటల్లో ఉన్న మామిడి కాయలు పక్వానికి రాగానే చెట్టు నుంచి దింపు చేస్తుంటారు.
- ఇక మామిడి చెట్లు లేని వారు ఈ సీజన్‌లో గాలులు, వానల వల్ల నేల రాలిన మామిడి కాయలను సేకరించి కాయలపై ఉన్న తొక్కను చాకచక్యంగా తొలగిస్తారు.
- ఇందుకు సముద్రం ఒడ్డున లభించే పెద్ద గుల్లలను ఉపయోగిస్తారు. లేదంటే కూరగాయలు తురిమే చాకులను ఉపయోగిస్తారు.
- మామిడి కాయను నిలువుగా చీల్చి మధ్యలో ఉన్న టెంకను పారవేస్తారు.
- ముందుగా మంచినీటిలో ఉప్పును కలిపి తయారు చేసుకున్న బాన లేదా బకెట్ వంటి పాత్రల్లో ఈ ముక్కలను వేసి ఒక్క రోజు నిల్వ ఉంచుతారు.
- మరుసటి రోజు జాగ్రత్తగా ఈ మామిడి ముక్కలను ఉప్పు నీటి నుంచి బయటకు తీసి మండు టెండలో ఎండబెడతారు.
- సుమారు 15 రోజుల నుంచి నెల రోజుల వరకు ఎండబెట్టిన మామిడి ముక్కల్లో ఉన్న నీరు పూర్తిగా ఇంకిపోయి ముడతలుగా తయారవుతాయి.



మండు టెండలో ఆరబెట్టిన మామిడి బద్దలు

ఎన్నాళ్లయినా..

సాధారణంగా పండ్లతో తయారు చేసిన వస్తువులు కొన్ని రోజుల వరకు మాత్రమే నిల్వ ఉంటాయి. కానీ ఎండు మామిడి మాత్రం ఎన్నేళ్లయినా నిల్వ ఉంటాయి. వీటిని అన్ని రకాల కూరల్లో విరివిగా వాడుతారు ఇదే ఎండు మామిడి బద్దల్లో కారం, ఆవ పిండి, మెంతు పిండి, వెల్లుల్లి, ఉప్పు, వేరు శనగ నూనె మిశ్రమాలతో తీపి, వగరు ఊరగాయలు సైతం తయారు చేస్తుంటారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో 'మామిడి బద్దల పప్పు' ప్రత్యేకం. ఉద్దానంలో తయారు చేసిన ఎండు మామిడి ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతోంది.



ఊరగాయకు ఉపయోగించే ఎండు మామిడి ముక్కలు

మధుకేశ్వరుని కల్యాణోత్సవం ప్రారంభం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో జ్యేష్ఠ మాసం మంగళవారం శ్రీముఖలింగేశ్వరుని పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజతో ప్రారంభమై ఘనంగా ధ్వజారోహణ జరిగింది. పుణ్యాహవచనం, మంటపారాధన, బలిహరణ నిర్వహించి ముంగళం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి,పాలక మండళి సభ్యులు, ఈఓ ప్రభాకరరావు అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామికి ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని విక్రంపురం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విక్రంపురం గ్రామానికి చెందిన బి.రాంబాబు ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రాంబాబు తలకు తీవ్ర గాయం కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.



ఉక్కపోత.. ఉపశమనం



ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రతిఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉక్కపోత, ఎండవేడిమితో అల్లాడిపోయారు. ఈ పరిస్థితిలో సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారి మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. – జి.సిగడాం

శాశ్వత పేదరిక నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టణ ప్రాంతాల్లో శాశ్వత పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న 200 మందికి శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా పనిచేస్తోందని చెప్పారు. స్వయం ఉపాధి, వ్యాపార యూనిట్ల నిర్వహణ, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి ప్రోత్సహించటం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణ ప్రాంతాల్లో 51,000 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరాలని చెప్పారు. పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం రాము, డీఆర్‌పీలు జయరాజు, దేవకన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



గిరిజన మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మంత్రి అప్పలరాజు, పీఓ కల్పనాకుమారి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: మహిళలు ఆర్థికాభ్యున్నతి చెందినప్పుడే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం కుంటికోట సమీపంలో గిరిజన యూత్ శిక్షణా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అందజేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, దీనిలో భాగంగానే మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామని వివరించారు. శిక్షణ పొందిన మహిళలు ముగ్గురు, నలుగురు కలిసి.. ఒక యూనిట్‌గా ఏర్పాటైతే ప్రయోజనం ఉంటుందన్నారు. టైలరింగ్‌తో పాటు ఎంబ్రాయిడింగ్ కూడా నేర్చుకోవాలన్నారు. మిషన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి మాట్లాడుతూ 35 మందికి శిక్షణ అందించి, కుట్టు మిషన్లు అందజేశామన్నారు. కలెక్టర్, ఐటీడీఏ నిధుల సహాయంతో 90 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, కుంటికోట ఎంపీటీసీ వాయలపల్లి మాధవరావు, కుంటికోట, వీరగున్నమ్మపురం సర్పంచ్‌లు దుంపల వైకుంఠరావు, కర్రి గోపాలకృష్ణ, ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి సెక్షన్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆహార భద్రతకు కృషి చేయండి



వార్షికోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం రూరల్: దేశ ఆహార భద్రతకు వ్యవసాయ విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండలం నైరా వ్యవసాయ కళాశాల హాస్టల్ 34వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండి కొత్తకొత్త ప్రయోగాలపై రూపకల్పన చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులకు కలెక్టర్ బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్, డాక్టర్ మదన్‌మోహన్‌రావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి మలేరియా మాసోత్సవాలు

- ప్రత్యేక చర్యలకు మలేరియా నిర్మూలన విభాగం అడుగులు



అరసవల్లి: మలేరియా నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకుంటే వచ్చే నష్టాలను ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించనుంది. జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా నిర్మూలన మాసోత్సవాలను పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపట్టనుంది.

మాసోత్సవాలు ఇలా..

- జిల్లాలో ప్రతి ఇంటా జ్వర అనుమానితులను రక్తపూతలు సేకరిస్తారు.
- దోమలు పెరగకుండా శానిటేషన్ కమిటీలతో గ్రూపు సమావేశాలను నిర్వహిస్తారు.
- దోమల నివారణకు అవగాహన కార్యక్రమంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా మలేరియా నిర్మూలనకు మార్గమనే విషయాన్ని తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- విలేజ్ శానిటేషన్ కమిటీల ద్వారా కమ్యూనిటీ భాగస్వామ్యంతో కాలువల శుభ్రపరుస్తూ.. పూడికల తీత కార్యక్రమాలను చేపడతారు.
- గ్రామాల్లో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, గ్రామస్తుల ద్వారా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను నిర్వహిస్తారు.
- యాంటీ లార్వా ఆపరేషన్లు ద్వారా దోమల లార్వాలున్న ప్రదేశాలను నిర్మూలించే ప్రక్రియ చేపట్టనున్నారు.
- ప్రత్యేక ద్రావణాన్ని దోమలు పెరగకుండా పిచికారీ చేయిస్తారు.
- అలాగే దోమల నియంత్రణకు వీలుగా గ్రామాల్లో దోమతెరలు పంపిణీ చేస్తారు.
- పాఠశాలల పిల్లలతో అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.
- విధిగా గ్రామాల్లో ఫ్రైడేను పక్కాగా జరిగేలా చేస్తారు.
- దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గ్రామాల్లో దండోరా, మైకుల ద్వారా ప్రజలకు తెలిసేలా ప్రచారాలు చేస్తారు.
- జ్వరాల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా అనుమానితులను గుర్తించి తగు చర్యలు చేపడతారు.
- గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తారు.